## ఐదో విడత బరిలో 695 మంది అభ్యర్థులు

న్యూఢిల్లీ, మే 8: లోక్‌సభ ఐదో విడతలో భాగంగా ఈ నెల 20న 8 రాష్ట్రాల్లోని 49 నియోజకవర్గాలకు జరిగే ఎన్నికల్లో 695 మంది అభ్యర్థులు బరిలో ఉన్నారు. ఈ విడతలో బీహార్, జమ్ముకశ్మీర్, జార్ఖండ్, లఢక్, మహారాష్ట్ర, ఒడిశా, యూపీ, పశ్చిమ బెంగాల్‌లో ఎన్నికలు జరుగనున్నాయి. మహారాష్ట్ర నుంచి అధికంగా 13 నియోజకవర్గాల్లో 301 మంది, యూపీలో 14 నియోజకవర్గాల్లో 466 మంది పోటీ చేస్తున్నారు. మహారాష్ట్రలోని థాణె నియోజకవర్గంలో అత్యధికంగా 69 మంది, లక్నోలో 67 మంది పోటీలో ఉన్నట్టు అధికారులు తెలిపారు.






# బీజేపీకి తేజస్వీ చెక్!

- బీహార్‌లో కమలం పార్టీకి గడ్డుపరిస్థితులు
- గత ఎన్నికల్లో 40 స్థానాల్లో 39 గెలుపు
- ఈ సారి గట్టి పోటీ ఇస్తున్న తేజస్వీయాదవ్
- ఎల్జేపీ చీలిక, నితీశ్ చేరికతో ఎన్డీయేకు మైనస్

(స్పెషల్ టాస్క్ బ్యూరో)

హైదరాబాద్, మే 8 (నమస్తే తెలంగాణ): బీహార్‌లో బీజేపీకి గడ్డు పరిస్థితులు కనిపిస్తున్నాయి. రాష్ట్రంలోని మొత్తం 40 లోక్‌సభ స్థానాల్లో ఇప్పటికే 14 నియోజకవర్గాలకు పోలింగ్ ముగియగా మరో 26 స్థానాల్లో ఓటింగ్ జరుగాల్సి ఉన్నది. గత లోక్‌సభ ఎన్నికల్లో 40 సీట్లకు గానూ ఏకంగా 39 స్థానాలను కైవసం చేసుకొన్న ఎన్డీయే కూటమి.. ఈసారి కూడా ఇదే స్థాయిలో స్థానాలను గెలవాలని భావిస్తున్నది. అయితే, అది అయ్యే పనిలా కనిపించడం లేదు. మూడు దశల్లో జరిగిన పోలింగ్‌లో ఓటింగ్ శాతం తగ్గడమే దీనికి నిదర్శనం.





**అప్పుడు వేరు.. ఇప్పుడు వేరు**

గత ఎన్నికలకు, బీహార్‌లో ఇప్పుడు మారిన రాజకీయ సమీకరణాలకు చాలా తేడా ఉన్నది. బీజేపీ, జేడీయూ, ఎల్జేపీతో కూడిన ఎన్డీఏ కూటమి 2019 ఎన్నికల్లో కలిసి బరిలోకి దిగి ఎక్కువ సీట్లు గెలుచుకొన్నది. అయితే, గత ఎన్నికల్లో ఎన్డీఏలో భాగస్వామిగా ఉన్న లోక్ జనశక్తి పార్టీ(ఎల్జేపీ) ఇప్పుడు రెండుగా చీలింది. రామ్‌విలాస్ పాశ్వాన్ సోదరుడు పశుపతి కుమార్ పరాస్ నేతృత్వంలో ఏర్పడిన రాష్ట్రీయ లోక్ జనశక్తి పార్టీ(ఆర్ఎల్‌జేపీ) ఎన్డీఏ నుంచి బయటకు రావడం ఎన్డీయేకు మైనస్‌గా మారింది. ఇక, బీహార్‌కు తొమ్మిదోసారి ముఖ్యమంత్రిగా ఉన్న నితీశ్ కుమార్ ప్రభావం కూడా క్రమంగా తగ్గుతున్నది. తరచూ కూటములు మార్చడం, మొన్నటి వరకు ఇండియా కూటమిలో ఉండి బీజేపీని విమర్శించి ఇప్పుడు అదే పార్టీతో జట్టు కట్టడం వంటి అంశాల వల్ల బీహార్ ప్రజల్లో నితీశ్ విశ్వసనీయత తగ్గుతున్నదని రాజకీయ విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. మరోవైపు గత ఎన్నికల్లోలా ఈసారి బీహార్‌లో క్లీన్‌స్వీప్ చేసే పరిస్థితులు ఎన్డీఏకు లేవని ఆ కూటమి నేతలే స్వయంగా అంగీకరిస్తున్నారు. గత ఎన్నికల ఫలితాలను ఎన్డీఏ పునరావృతం చేయడం కష్టమేనని జేడీయూ నేత నీరజ్ కుమార్ పేర్కొన్నారు. పదేండ్లుగా కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ, రాష్ట్రంలో అధికారంలో ఉన్న నితీశ్ కుమార్ ప్రభుత్వ వ్యతిరేకత ప్రభావం ఎన్డీఏపై చూపించే అవకాశాలు ఉన్నాయని, నిరుద్యోగం, ధరల పెరుగుదల అంశాల్లో కేంద్రంపై ప్రజలు గుర్రుగా ఉండటంతో ఈసారి బీహార్‌లో బీజేపీ గెలుపు కష్టమేనని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

**తేజస్వీ దూకుడు**

లాలూ వారసుడిగా రాజకీయ ప్రవేశం చేసిన ఆయన కుమారుడు తేజస్వీ ఇప్పుడు బీహార్‌లో ప్రధాన నాయకుడిగా అవతరించారు. గత అసెంబ్లీ ఎన్నికల్లోనూ బీహార్‌లో ఆర్జేడీని అతి పెద్ద పార్టీగా నిలిపిన ఘనత తేజస్వీదే. ఇప్పుడు ఇండియా కూటమిలోనూ ఆర్జేడీనే 25 స్థానాలకు పోటీ చేస్తుండటం ద్వారా ఎక్కువ స్థానాల్లో పోటీ చేస్తున్న పార్టీగా నిలిచింది. తేజస్వీ.. బీహార్ ప్రజల్లో, ముఖ్యంగా యువతలో పట్టు సంపాదించుకున్నారు. దీనికి తగ్గట్టే ప్రచారంలో దూకుడు చూపిస్తున్నారు. సామాజిక సమీకరణాలను చూస్తే.. ఆర్జేడీ మొదటి నుంచి ముస్లిం - యాదవ ఓట్లను ఓటుబ్యాంకుగా మలుచుకున్నది. దీంతో తేజస్వీ అండ్ కో ఈసారి బీజేపీకి గట్టి పోటీ ఇవ్వవచ్చన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

## నడ్డా, మాలవీయకు కర్ణాటక పోలీసుల సమన్లు

- సోషల్ మీడియాలో వివాదాస్పద పోస్టుపై జారీ
- వారం రోజుల్లో విచారణకు రావాలని ఆదేశం




బెంగళూరు, మే 8: రిజర్వేషన్ల అంశానికి సంబంధించి బీజేపీ కర్ణాటక శాఖ తన ఎక్స్ ఖాతాలో పోస్ట్ చేసిన ఒక వివాదాస్పద వీడియోకు సంబంధించి బెంగళూరు పోలీసులు బుధవారం బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా, పార్టీ ఐటీ సెల్ హెడ్ అమిత్ మాలవీయకు సమన్లు జారీచేశారు. వారం రోజుల్లో బెంగళూరులోని హైగ్రౌండ్స్ పోలీసుస్టేషన్‌లో విచారణకు రావాలని వారిద్దరిని కోరినట్టు తెలిపారు. కర్ణాటక బీజేపీ సోషల్ మీడియాలో చేసిన పోస్టు.. ఒక పార్టీ అభ్యర్థికి ఓటు వేయకూడదని ఎస్సీ, ఎస్టీలను బెదిరించేలా ఉన్నదని, ఎన్నికల కోడ్ ఉల్లంఘనకు పాల్పడ్డారని ఆరోపిస్తూ రాష్ట్ర కాంగ్రెస్ ఈ నెల 5న పోలీసులకు ఫిర్యాదు చేసింది. దీనికి సంబంధించి జేపీ నడ్డా, మాలవీయతోపాటు బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బీవై విజయేంద్రపై కూడా ఎఫ్ఐఆర్ నమోదైంది.

### ఈవీఎంకు పూజలు.. మహిళా కమిషన్ చీఫ్‌పై కేసు

పుణే: మహారాష్ట్రలోని బారామతి లోక్‌సభ నియోజకవర్గంలో ఓ ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రం (ఈవీఎం)కు పూజలు చేసినందుకు రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్ రూపాలీ చకంకర్‌పై కేసు నమోదైంది. ఆమె, మరో ఏడుగురు ఖడక్‌వస్లా సెగ్మెంట్‌లోని పోలింగ్ బూత్‌లోనికి వీరు ప్రవేశించి, ప్రిసైడింగ్ అధికారి ఆదేశాలను ధిక్కరించి, ఈవీఎంకు పూజలు చేసినట్లు ఆరోపణలు నమోదయ్యాయి. మే 7న జరిగిన పోలింగ్ సందర్భంగా ఈ సంఘటన జరిగినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు.

### '2.5 కోట్లు ఇస్తే.. ఈవీఎం మార్చేస్తా'

ముంబై: డబ్బు ఇస్తే ఈవీఎం మార్చేస్తానంటూ ఓ రాజకీయ నేతను మోసగించేందుకు యత్నించిన ఆర్మీ జవానును పోలీసులు అరెస్ట్ చేశారు. శివసేన (యూబీటీ) నేత, మహారాష్ట్ర శాసన మండలిలో ప్రతిపక్ష నేత అంబదాస్ దన్వే ఫిర్యాదు మేరకు వివరాలిలా ఉన్నాయి. ఈవీఎంలను తారుమారు చేయడానికి దన్వేను ఆర్మీ జవాన్ మారుతి ధక్నే (42) రూ.2.5 కోట్లు లంచం అడిగారు. రూ.1.5 కోట్లకు బేరం కుదుర్చుకున్నాడు. పోలీసులు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు.

## మహిళా ఎంపీలు.. 72 ఏండ్లలో ముగ్గురే!

### హిమాచల్‌లో కొరవడిన ప్రాతినిధ్యం.. ఈసారీ బరిలో ఇద్దరే

సిమ్లా: హిమాచల్ ప్రదేశ్ నుంచి చట్ట సభలకు ఎన్నికవుతున్న మహిళల సంఖ్య చాలా తక్కువగా ఉంది. నుంచి లోక్ సభకు ఎన్నికైన మహిళా ఎంపీలు గడచిన 72 ఏళ్లలో కేవలం ముగ్గురే! ప్రస్తుత ఎన్నికల్లో కేవలం ఇద్దరు మహిళలు మాత్రమే బరిలో నిలిచారు. రాష్ట్రంలోని ఓటర్లలో సుమారు 49 శాతం మంది మహిళలు ఉన్నప్పటికీ, లోక్ సభలో వారి ప్రాతినిధ్యం తక్కువగా ఉంది. రాష్ట్రంలో నాలుగు లోక్ సభ స్థానాలు ఉన్నాయి. ఈసారి బీజేపీ, బీఎస్పీ చెరొక స్థానం నుంచి మహిళలను నిలిపాయి. మండి నుంచి కంగన రనౌత్ (బీజేపీ), కాంగ్రా నుంచి రేఖా రాణి (బీఎస్పీ) పోటీ చేస్తున్నారు. ఇదిలావుండగా, రాజ్య సభ ఎంపీలుగా ఈ రాష్ట్రం నుంచి 8 మంది మహిళలు ఎన్నికయ్యారు. శాసన సభకు 1967 వరకు మహిళలు ఎన్నిక కాలేదు. 1977, 2022లలో ఒకరు, 1998 ఎన్నికల్లో ఏడుగురు మహిళలు ఎమ్మెల్యేలుగా గెలిచారు.

## హిందువుల జనాభాలో తగ్గుదల

### ప్రధాని ఆర్థిక సలహా మండలి నివేదిక

(స్పెషల్ టాస్క్ బ్యూరో)

హైదరాబాద్(నమస్తే తెలంగాణ): 1950-2015 మధ్య దేశంలో హిందువుల జనాభా 84.68 శాతం నుంచి 78.06 శాతానికి తగ్గగా, ఇదే సమయంలో ముస్లింల జనాభా 9.84 శాతం నుంచి 14.09 శాతానికి పెరిగింది. ఈ మేరకు ప్రధాని ఆర్థిక సలహా మండలి (ఈఏసీ-పీఎం) ఒక నివేదికలో వెల్లడించింది. అయితే, ఎన్నికల సమయంలో బీజేపీ సర్కారు ఇలాంటి నివేదికలను విడుదల చేయడంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. హిందువుల ఓటు బ్యాంకు కోసమే మోదీ సర్కారు ఇలా చేస్తున్నట్టు ప్రతిపక్ష పార్టీలు మండిపడుతున్నాయి.

## తమిళనాడు తొలి బీజేపీ ఎమ్మెల్యే కన్నుమూత

చెన్నై, మే 8: తమిళనాడు అసెంబ్లీలో బీజేపీ నుంచి మొదటి ఎమ్మెల్యేగా ప్రాతినిధ్యం వహించిన సీ వేలాయుధన్ బుధవారం కన్నుమూశారు. 73 ఏండ్ల వేలాయుధన్ మొదటిసారి 1996లో పద్మనాభపురం ఎమ్మెల్యేగా గెలిచి అసెంబ్లీలో అడుగుపెట్టారు. ఆయన మృతికి పార్టీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా సంతాపం వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే కాక ముందు వేలాయుధన్ ఆరెస్సెస్ అనుబంధ సంస్థ సేవాభారతిలో పనిచేశారు. అలాగే 1975-77 మధ్య ఎమర్జెనీ వ్యతిరేక ఉద్యమంలో చురుకుగా పాల్గొన్నారు.

## కొవిషీల్డ్ వ్యాక్సిన్లు వెనక్కి!

లండన్/న్యూఢిల్లీ, మే 8: 'కొవిషీల్డ్‌తో దుష్ప్రభావాలు నిజమే.. అరుదైన కేసుల్లో రక్తం గడ్డ కట్టడం, ప్లేట్‌లెట్ల కౌంట్ తగ్గిపోవటం లాంటి సమస్యలు ఎదురయ్యాయి' అని బాంబ్ పేల్చిన ఆస్ట్రాజెనెకా ఇప్పుడు తన కరోనా వ్యాక్సిన్లను వెనక్కి తీసుకుంటున్నది. ఈ వ్యాక్సిన్ డోసులను భారత్‌లో సీరం ఇన్‌స్టిట్యూట్ తయారుచేసింది. అయితే, ఇప్పుడు కరోనా ప్రభావం తగ్గిపోవటం, మిగులు డోసులు ఉండటంతో వ్యాక్సిన్లను వెనక్కి తీసుకుంటున్నట్టు ఆస్ట్రాజెనెకా వెల్లడించింది. అదీకాక.. ఈ వ్యాక్సిన్ ఇక నుంచి వినియోగానికి అనుమతి లేదని యురోపియన్ మెడిసిన్స్ ఏజెన్సీ ఆ సంస్థకు నోటీసు కూడా జారీ చేసింది. అయితే, దుష్ప్రభావాలు ఉన్నాయని తెలిపిన కొన్నిరోజులకే వ్యాక్సిన్లను వెనక్కి రప్పించటంపై సందేహాలు తలెత్తుతున్నాయి.

## రెడ్‌లైన్ దాటుతున్నారు..

### కెనడాలో సిక్కు వేర్పాటువాదులకు భారత్ వార్నింగ్

ఒట్టావా: కెనడా-భారత్ మధ్య దౌత్య సంబంధాలు దెబ్బతిన్న వేళ కెనడాలోని సిక్కు వేర్పాటువాదులకు భారత దౌత్యవేత్త సంజయ్ కుమార్ మంగళవారం హెచ్చరికలు చేశారు. దేశ ప్రాదేశిక సమగ్రత, భద్రతకు ముప్పుగా భారత్ ఈ సమస్యను చూస్తున్నదని, సిక్కు వేర్పాటువాదులు ఈ విషయంలో రెడ్ లైన్‌ను దాటుతున్నారని హెచ్చరించారు. నిజ్జర్ కేసుకు సంబంధించి ముగ్గురు భారత జాతీయులను కెనడా పోలీసులు అరెస్ట్ చేసి కోర్టు ముందు హాజరుపర్చిన నేపథ్యంలో ఆయన తొలిసారిగా ఈ వ్యాఖ్యలు చేశారు. ద్వంద్వ పౌరసత్వాన్ని భారత్ గుర్తించదని, ఎవరైనా వలస వస్తే వారిని విదేశీయులుగానే గుర్తిస్తామని ఆయన స్పష్టం చేశారు.

## ఈ ఏప్రిల్‌లో ఉష్ణోగ్రత సరికొత్త రికార్డు

న్యూఢిల్లీ: అనేక దేశాల్లో ఈ ఏడాది ఏప్రిల్‌లో రికార్డు స్థాయి ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. రికార్డు స్థాయి ఉష్ణోగ్రతల నెలల్లో ఇది 11వది. 2024 ఏప్రిల్ నెల సగటు ఉష్ణోగ్రత 15.03 డిగ్రీల సెల్సియస్. 1850-1900 సంవత్సరాల్లోని ఏప్రిల్ నెలల్లో సగటు ఉష్ణోగ్రతలతో పోల్చుకుంటే, 2024 ఏప్రిల్ నెల సగటు ఉష్ణోగ్రత 1.58 డిగ్రీల సెల్సియస్ ఎక్కువ. 1991-2020 వరకు గల సంవత్సరాల్లోని ఏప్రిల్ నెలల్లో సగటు ఉష్ణోగ్రతలతో పోల్చుకుంటే, 0.67 డిగ్రీలు ఎక్కువ. 2016 ఏప్రిల్‌లో సగటు ఉష్ణోగ్రత అధికంగా నమోదైంది, దీని కన్నా ఈ ఏడాది ఏప్రిల్‌లో 0.14 డిగ్రీల సెల్సియస్ ఎక్కువ.

## ఆప్‌లో చేరిన బీఎస్పీ అభ్యర్థి

చండీగఢ్, మే 8: పంజాబ్‌లో బీఎస్పీకి ఎదురుదెబ్బ తగిలింది. ఆ పార్టీ హోషియార్‌పూర్ అభ్యర్థి రాకేశ్ సోమన్ బుధవారం సీఎం భగవంత్ మాన్ సమక్షంలో ఆప్‌లో చేరారు. రాకేశ్ మాట్లాడుతూ మాన్ ప్రభుత్వ విధానాలు తనను ఆకట్టుకున్నాయన్నారు. పేదలకు మెరుగైన విద్య, ఆరోగ్య సదుపాయాలు కల్పిస్తున్నారని ప్రశంసించారు.

## 'మతవిద్వేష వ్యాఖ్యలు చేయకుండా మోదీని అడ్డుకోండి'

చెన్నై, మే 8: మత ప్రాతిపదికన ముస్లింలకు రిజర్వేషన్లు కల్పించడంపై ఎన్నికల ప్రచార సభలలో ప్రధాని మోదీ తీవ్ర విమర్శలు చేయడంపై కాంగ్రెస్ ఆగ్రహం వ్యక్తం చేసింది. మైనారిటీలను లక్ష్యంగా చేసుకుని, వారిని అవమానించేలా మోదీ చేస్తున్న వ్యాఖ్యలను నిరోధిస్తూ ఆదేశాలివ్వాలని మద్రాస్ హైకోర్టును ఆశ్రయించింది. ముఖ్యంగా ఇటీవల మోదీ చేసిన మంగళ సూత్రం, ముస్లింల్లో జననాల రేటు పెరుగుదల వంటి వ్యాఖ్యలను ప్రస్తావించారు. ఇవి ఆ వర్గాన్ని అవమానించడమేనని అన్నారు. తమిళనాడు కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు కే సెల్వపెరుంతగై ఈ పిటిషన్ దాఖలు చేశారు. అయితే ఈ పిటిషన్‌ను నెంబర్ చేయడానికి రిజిస్ట్రీ విముఖత వ్యక్తం చేశారని, ఈ విషయంలో ధర్మాసనం రిజిస్ట్రీకి తగు సూచనలు ఇవ్వాలని అడ్వకేట్ సూర్యప్రకాశం కోరారు. దీనిపై జోక్యం చేసుకున్న ధర్మాసనం రిజిస్ట్రీ అడిగే వివరాలతో సమాధానాన్ని దాఖలు చేయాలని కౌన్సిల్‌ను ఆదేశించింది.

## కేజ్రీవాల్‌కు మధ్యంతర బెయిల్‌పై రేపు తీర్పు

న్యూఢిల్లీ, మే 8: మద్యం పాలసీ కేసులో ఢిల్లీ సీఎం, ఆప్ అధినేత అరవింద్ కేజ్రీవాల్‌కు మధ్యంతర బెయిల్ మంజూరుపై సుప్రీంకోర్టు ఈ నెల 10న తీర్పు వెలువరించనున్నది. ఆయన మధ్యంతర బెయిల్‌పై మంగళవారం విచారణ జరిపిన సుప్రీంకోర్టు తీర్పును రిజర్వ్ చేసిన విషయం తెలిసిందే.

## బీజేపీ ప్రభుత్వాన్ని దించేందుకు సిద్ధం

### జేజేపీ నేత దుష్యంత్ చౌతాలా ప్రకటన



చండీగఢ్, మే 8: లోక్‌సభ ఎన్నికల వేళ హర్యానాలో రాజకీయ పరిణామాలు ఆసక్తికరంగా మారాయి. రాష్ట్రంలోని బీజేపీ ప్రభుత్వానికి ముగ్గురు స్వతంత్ర ఎమ్మెల్యే మద్దతు ఉపసంహరించుకోవడంతో సంక్షోభ పరిస్థితి ఏర్పడింది. సీఎం నాయబ్ సైనీ నేతృత్వంలోని బీజేపీ సర్కార్ మైనార్టీలో పడిందని, రాష్ట్రంలో రాష్ట్రపతి పాలన విధించాలని, ముందస్తు అసెంబ్లీ ఎన్నికలు నిర్వహించాలని ప్రతిపక్ష కాంగ్రెస్ డిమాండ్ చేస్తున్నది. ఈ పరిణామాల నేపథ్యంలో బీజేపీ మాజీ మిత్రపక్షం జన్‌నాయక్ జనతా పార్టీ(జేజేపీ) బుధవారం కీలక ప్రతిపాదన చేసింది. రాష్ట్రంలో బీజేపీ ప్రభుత్వాన్ని దించేందుకు కాంగ్రెస్‌కు సహకరించేందుకు సిద్ధంగా ఉన్నామని పేర్కొన్నది. అసెంబ్లీలో అవిశ్వాస తీర్మానం తీసుకొస్తే, బీజేపీ సర్కారుకు వ్యతిరేకంగా ఓటు వేస్తామని జేజేపీ నేత దుష్యంత్ చౌతాలా హిస్సార్‌లో మాట్లాడుతూ పేర్కొన్నారు. అయితే తమ ప్రభుత్వానికి ఎలాంటి ఇబ్బంది లేదని సీఎం నాయబ్ సింగ్ అంటున్నారు. చాలా మంది ఎమ్మెల్యేలు బీజేపీతో టచ్‌లో ఉన్నారని, ఆందోళన చెందాల్సిన అవసరం లేదని మాజీ సీఎం ఖట్టర్ పేర్కొనడం గమనార్హం.

## హిసార్‌లో 'చౌతాలా' ఫ్యామిలీ వార్!

### వేర్వేరు పార్టీల నుంచి కుటుంబసభ్యుల పోటీ

హిస్సార్, మే 8: హర్యానాలోని హిసార్ లోక్‌సభ స్థానంలో చౌతాలా కుటుంబ పోరు రసవత్తరంగా మారింది. రాష్ట్రంలో రాజకీయంగా ప్రభావం చూపే చౌతాలా కుటుంబానికి చెందిన ముగ్గురు నేతలు వేర్వేరు పార్టీ నుంచి బరిలో నిలిచారు. చౌతాల వంశ కోడళ్లు ఎమ్మెల్యే నైనా చౌతాలా, సునైనా చౌతాలాలు జేజేపీ, ఐఎన్ఎల్‌డీ నుంచి పోటీ చేస్తున్నారు. బీజేపీ నుంచి రంజిత్ సింగ్ చౌతాలా బరిలో నిలిచారు. నైనా, సునైనాల మామలకు రంజిత్ చౌతాలా సోదరుడే కావడం గమనార్హం. నైనా చౌతాలా మాజీ సీఎం ఓంప్రకాశ్ చౌతాలా పెద్ద కుమారుడు, జేజేపీ అధ్యక్షుడు అజయ్ సింగ్ భార్య. వీరి కుమారుడు అయిన దుష్యంత్ రాష్ట్ర డిప్యూటీ సీఎంగా చేశారు. ఐఎన్ఎల్‌డీ అభ్యర్థి సునైనా ఆ పార్టీ మహిళా విభాగం ప్రధాన కార్యదర్శిగా ఉన్నారు.

# చితికిన హస్తం

- మసకబారిన కాంగ్రెస్ పార్టీ ప్రభ
- 2024 లోక్‌సభ ఎన్నికల బరిలో కేవలం 328 స్థానాల్లోనే పోటీ
- 400 సీట్ల కంటే తక్కువగా అభ్యర్థులను నిలపడం చరిత్రలో ఇదే తొలిసారి



న్యూఢిల్లీ, మే 8: దేశంలో గ్రాండ్ ఓల్డ్ పార్టీ అని చెప్పుకొనే కాంగ్రెస్ పరిస్థితి నానాటికీ దిగజారుతున్నది. గతంలో సొంతంగా అధికారం చేపట్టే స్థాయి నుంచి లోక్‌సభలో ఇప్పుడు ప్రతిపక్ష పార్టీ హోదాకు అవసరమైన కనీసం 10% ఎంపీ స్థానాలను కూడా సాధించలేని దుస్థితికి హస్తం పార్టీ చేరింది. ఆ పార్టీ చరిత్రలో ఎన్నడూ లేని విధంగా 2024 లోక్‌సభ ఎన్నికల్లో పోటీచేస్తున్న స్థానాల సంఖ్య తొలిసారి 400 కంటే తక్కువకు పడిపోయింది. ఈ సార్వత్రిక ఎన్నికల్లో కేవలం 328 స్థానాల్లో మాత్రమే అభ్యర్థులను నిలబెట్టింది. 2019 ఎన్నికల్లోనూ యూపీఏలో కూటమిగా ఉన్నప్పటికీ, ఆ పార్టీ సొంతంగా 421 స్థానాల్లో పోటీచేయడం గమనార్హం. తాజా పరిస్థితికి యూపీ, తమిళనాడు, మహారాష్ట్ర, బీహార్ వంటి రాష్ట్రాల్లో ఆ పార్టీ బలంగా లేకపోవడం, ప్రాంతీయ పార్టీలు బలంగా ఉండటం వంటి కారణాలు ఉన్నాయని రాజకీయ విశ్లేషకులు అంటున్నారు.

**గతంలో కూటముల్లో ఉన్నప్పటికీ..**

ఈసారి లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ పోటీచేసే స్థానాల సంఖ్య గణనీయంగా తగ్గడానికి ఇండియా కూటమిలో భాగస్వామిగా ఉండటం కారణంగా చెప్పవచ్చు. ఉత్తరప్రదేశ్, మహారాష్ట్ర, తమిళనాడు తదితర రాష్ట్రాల్లో కాంగ్రెస్ కంటే బలంగా ఉన్న ఇండియా కూటమిలోని ప్రాంతీయ పార్టీలు సింహభాగం సీట్లను తీసుకొన్నాయి. అయితే కూటమిగా ఎన్నికలకు వెళ్లడం కాంగ్రెస్ పార్టీకి కొత్త కాదు. 1989-1999 మధ్య కూటముల సమయంలోనూ ఆ పార్టీ 450కి పైగా స్థానాల్లో పోటీచేయడం గమనార్హం. అయితే ఈ సారి పరిస్థితి అందుకు విరుద్ధంగా ఉన్నట్టు కనిపిస్తున్నది.

**యూపీలో మరీ దారుణ పరిస్థితి**

యూపీలో 2019 ఎన్నికల్లో సొంతంగా 67 స్థానాల్లో పోటీచేసిన కాంగ్రెస్(కేవలం ఒక్క సీటు- రాయ్‌బరేలీ మాత్రమే గెలిచింది).. ఈసారి ఎన్నికల్లో కేవలం 17 స్థానాల్లోనే అభ్యర్థులను నిలబెట్టింది. రాష్ట్రంలో బలంగా ఉన్న అఖిలేశ్ యాదవ్ నేతృత్వంలోని సమాజ్‌వాదీ పార్టీ అధిక స్థానాల్లో పోటీచేస్తున్నది. బెంగాల్‌లో లెఫ్ట్ పార్టీలతో కూటమిలో భాగంగా కాంగ్రెస్ 42కిగానూ 14 లోక్‌సభ స్థానాల్లోనే బరిలో నిలిచింది. 2019 ఎన్నికల్లో 40 స్థానాల్లో పోటీచేసిన హస్తం పార్టీ.. కేవలం రెండు స్థానాల్లోనే విజయం సాధించింది. మహారాష్ట్రలో 48 సీట్లకుగానూ ఇండియా కూటమిలోని కాంగ్రెస్-17, శివసేన(యూబీటీ)-21, ఎన్సీపీ(ఎస్పీ)-10 స్థానాల్లో పోటీచేస్తున్నాయి. 2014, 2019 లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ మహారాష్ట్రలో వరుసగా 25, 26 స్థానాల చొప్పున పోటీచేసింది.

**గత ఐదు పర్యాయాలుగా కాంగ్రెస్ ఇలా..**

| లోక్‌సభ ఎన్నికలు | పోటీచేసిన స్థానాలు | గెలుపు |
|---|---|---|
| 2004 | 417 | 145 |
| 2009 | 440 | 206 |
| 2014 | 464 | 44 |
| 2019 | 421 | 52 |
| 2024 | 328 | - |

## అనారోగ్యకర ఆహారంతోనే 56% వ్యాధులు



### ఆహార మార్గదర్శకాలు జారీ చేసిన ఐసీఎంఆర్

న్యూఢిల్లీ: అనారోగ్యకర ఆహారపు అలవాట్ల వల్ల వ్యాధుల భారం పెరుగుతున్నదని భారత వైద్య పరిశోధన మండలి (ఐసీఎంఆర్) తెలిపింది. మొత్తం వ్యాధుల భారంలో 56.4 శాతం వరకు సరైన ఆహారం సరైన రీతిలో తీసుకోకపోవడమే కారణమని పేర్కొంది. మధుమేహం, ఊబకాయం వంటి అసాంక్రమిక వ్యాధులను నిరోధించేందుకు ఉపయోగపడే 17 రకాల ఆహారపు అలవాట్లు, న్యూట్రియెంట్లతో కూడిన ఆహార పదార్థాలను సూచించింది. ఆరోగ్యకరమైన ఆహారపు అలవాట్లు, శారీరక కార్యకలాపాల వల్ల గుండె సంబంధిత వ్యాధులు, హైపర్‌టెన్షన్ తగ్గుతాయని, టైప్-2 మధుమేహాన్ని 80 శాతం వరకు నిరోధించవచ్చునని వివరించింది. ఆరోగ్యవంతమైన జీవనశైలి వల్ల అకాల మరణాలను చెప్పుకోదగ్గ స్థాయిలో నిరోధించవచ్చునని తెలిపింది. అత్యధికంగా ప్రాసెస్ చేసిన ఆహార పదార్థాలను షుగర్స్, ఫ్యాట్స్‌తో కలిపి తినడంతోపాటు, శారీరక శ్రమ తగ్గడం వల్ల, వైవిధ్య భరితమైన ఆహార పదార్థాలను తినకపోవడం వల్ల, మైక్రోన్యూట్రియెంట్ లోపాలు, అధిక బరువు సమస్యలు తీవ్రమవుతాయని హెచ్చరించింది.

## భారత్‌లో గూగుల్ వ్యాలెట్ సేవలు

న్యూఢిల్లీ, మే 8: గూగుల్ తన డిజిటల్ వాలెట్ అప్లికేషన్ 'గూగుల్ వ్యాలెట్' సేవల్ని భారతదేశంలో ప్రారంభించింది. వివిధ రకాల కార్డులు, ఐడీలు, మనం ఏర్పరుచుకునే కీ లేదా ఐడీలు, లాయల్టీ కార్డులు, ట్రాన్సిట్ పాసులు.. సమస్త సమాచారాన్ని ఈ వ్యాలెట్‌లో భద్రపర్చుకోవచ్చునని కంపెనీ వర్గాలు తెలిపాయి. సురక్షితమైన ప్రైవేట్ డిజిటల్ వాయలెట్‌గా దీనిని పేర్కొన్నాయి. 'ప్లే స్టోర్' నుంచి 'గూగుల్ వ్యాలెట్'ను డౌన్‌లోడ్ చేసుకొని యూజర్లు సేవలు పొందొచ్చునని కంపెనీ వివరించింది.

# 100కు పైగా ఎయిరిండియా ఎక్స్‌ప్రెస్ విమానాల రద్దు




- క్యాబిన్ సిబ్బంది మూకుమ్మడిగా సెలవు
- 15 వేల మంది ప్రయాణికులపై ప్రభావం
- పలు చోట్ల ప్రయాణికుల ఆందోళనలు
- నివేదిక కోరిన పౌరవిమానయాన శాఖ

న్యూఢిల్లీ/కొచ్చి, మే 8: టాటా గ్రూపు ఆధ్వర్యంలోని ఎయిరిండియా ఎక్స్‌ప్రెస్ విమానయాన సంస్థకు ఉద్యోగులు షాకిచ్చారు. ఆ సంస్థ యాజమాన్య విధానాలను నిరసిస్తూ అనారోగ్య కారణాలతో 200 మందికిపైగా క్యాబిన్ సిబ్బంది ఒకేసారి మూకుమ్మడిగా సెలవు పెట్టారు. ఫలితంగా మంగళవారం రాత్రి నుంచి 100కి పైగా దేశీయ, అంతర్జాతీయ విమాన సర్వీసులు రద్దయ్యాయి. అనేక విమానాలు ఆలస్యమయ్యాయి. దీని వలన దాదాపు 15 వేల మంది ప్రయాణికులపై ప్రభావం పడినట్టు సమాచారం. ఢిల్లీ, కొచ్చి, కాలికట్, బెంగళూరు సహా పలు ఎయిర్‌పోర్టుల్లో విమాన సర్వీసులకు అంతరాయం ఏర్పడింది. ఒక్క ఢిల్లీ ఎయిర్‌పోర్టులోనే బుధవారం ఉదయం 4 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు 14 విమానాలు రద్దయ్యాయి. సిబ్బంది కొరత కారణంగా గల్ఫ్‌కు గణనీయ సంఖ్యలో విమాన సర్వీసులు నడిపే ఎయిరిండియా ఎక్స్‌ప్రెస్.. ఈనెల 13 వరకు విమాన సర్వీసులను తగ్గించుకోవాలని నిర్ణయించింది.

**ప్రయాణికులు ఆందోళన**

కేరళలోని విమానాశ్రయాల్లో ప్రయాణికులు ఆందోళనకు దిగారు. విమానాల రద్దుపై నివేదిక సమర్పించాలని ఎయిరిండియా ఎక్స్‌ప్రెస్ యాజమాన్యాన్ని పౌరవిమానయాన శాఖ కోరింది. ప్రయాణికులకు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేస్తున్నామని, డబ్బులు తిరిగి చెల్లిస్తున్నామని, ప్రయాణాన్ని రద్దు చేసుకునేందుకు అంగీకరించిన వారికి మరో తేదీకి టికెట్ ఇస్తున్నామని ఎయిరిండియా ఎక్స్‌ప్రెస్ వివరించింది.

**మొన్న విస్తారా.. నేడు ఎయిరిండియా ఎక్స్‌ప్రెస్!**

ఎయిరిండియా ఎక్స్‌ప్రెస్, విస్తారాలను నిర్వహిస్తున్న టాటా గ్రూపులో సంస్థాగతంగా నిర్వహణా లోపాలు, ఉద్యోగులపై అనుసరిస్తున్న వైఖరిపై ఉద్యోగులు గుర్రుగా ఉన్నారు. 'మూకుమ్మడి సెలవుల'పై వెల్లువ నిరసనలు వ్యక్తం చేస్తున్నారు. కొన్ని రోజుల క్రితం విస్తారాలోనూ ఇదే పరిస్థితి కనిపించింది. ఓవైపు కంపెనీ లాభాల్లో ఉన్నా, తమకు హెచ్ఆర్ఏ వంటి అలవెన్స్‌లు తొలగించడంపై ఎయిరిండియా ఎక్స్‌ప్రెస్ ఉద్యోగుల సంఘం ఏప్రిల్‌లో టాటా గ్రూప్ చైర్మన్ ఎన్ చంద్రశేఖరన్‌కు లేఖ రాసింది. పైలట్లకు కొత్త వేతన విధానాన్ని అన్ని టాటా గ్రూపు విమానయాన సంస్థల్లో అమలు చేయాలని తీసుకొన్న నిర్ణయాన్ని విస్తారాలో పైలట్లు, ఫస్ట్ ఆఫీసర్లు వ్యతిరేకించారు. సంబంధిత కాంట్రాక్ట్‌పై సంతకం చేయాలని యాజమాన్యం ఉద్యోగులకు అల్టిమేటం ఇవ్వడం ఉద్యోగుల ఆగ్రహానికి కారణమైంది. రోస్టర్ విధానంపై అసంతృప్తి, వీక్లీ ఆఫ్‌లు కూడా ఉండటం లేదని విస్తారాలో ఉద్యోగులు గత నెల మూకుమ్మడి సెలవులకు వెళ్లారు.

## విదేశీ విద్యార్థులకు ఆస్ట్రేలియా మరో షాక్!

### మినిమం సేవింగ్స్ లిమిట్ రూ. 16 లక్షలకు పెంపు

భారత విద్యార్థులపై ప్రభావం

కాన్‌బెర్రా, మే 8: వలసల్ని అడ్డుకునేందుకు ఆస్ట్రేలియా ప్రభుత్వం మరో కఠిన నిర్ణయం తీసుకుంది. స్టూడెంట్ వీసా 'ప్రూఫ్ ఆఫ్ సేవింగ్స్'ను భారీగా పెంచింది. కోర్సు పూర్తిచేసేందుకు తగినంత నిధులు ఉన్నాయని చూపే, 'ప్రూఫ్ ఆఫ్ సేవింగ్స్'లో కనీస మొత్తాన్ని 3,430 డాలర్ల నుంచి 19,576 డాలర్లకు (2,86,423 నుంచి రూ.16,34,699) పెంచింది. గత ఏడు నెలల్లో దీన్ని పెంచటం ఇది రెండోసారి. భారతీయ విద్యార్థులకు ఇది అదనపు భారం కానున్నది. స్టూడెంట్ వీసా నిబంధనల్లో చేసిన ఈ కొత్త మార్పు, ఉన్నత చదువుల కోసం ఆ దేశం వెళ్లాలనుకునే విద్యార్థులపై తీవ్ర ప్రభావం చూపనున్నది.